# వీడిన మబ్బు

కె.వి. రమణారావు

రాజేశ్వరావు చిరుద్యోగి. రిటైర్‌మెంటుకు చేరువలో ఉన్నాడు. అతని భావాలు విశాలం. ఆలోచనలు లోతుగా ఉంటాయి. తనకన్నా ఇతరుల సుఖాన్ని ఎక్కువగా కోరుకుంటాడు. ఆచారాలు, సంప్రదాయాలంటూ గుడ్డిగా ఆచరించడు. అలాగని త్రోసి పుచ్చడు. సాంప్రదాయాల వెనకగల ఆంతర్యమేమిటని తనదైన శైలిలో విశ్లేషించుకుని అవసరం మేరకు ఆచరించడానికి వెనుకాడడు. అర్ధాంగి రాజ్యలక్ష్మి ఆలోచనాసరళి భర్త భావాలకు పూర్తిగా భిన్నం. సమాజమే ఆమెకు మార్గదర్శి. పదుగురాడు మాటే ఆమెకు పాడి. నలుగురు చేతలే న్యాయం. అనాదిగా వస్తున్న ఆచారాలు సరిఅయినవేనని, అందుకే నేటికీ వాటిని ఆచరిస్తున్నారన్నదే ఆమెకున్న దృఢమైన అభిప్రాయం. ఈ కారణంగా దంపతులిద్దరూ వాదసంవాదాలతోనే కాపురం చేస్తున్నా... అంతిమ విజయం అర్ధాంగి రాజ్యలక్ష్మినే వరిస్తోంది.

***

ఆకాశం మేఘావృతమయింది. బయట సన్నగ తుంపర. రాజేశ్వరావు ఇంటిపట్టునే ఉన్నాడు ఏదో పుస్తకం చదువుతూ. వేగంగా పడుతున్న రాజ్యలక్ష్మి అడుగుల సవ్వడివిని క్రీగంట చూచాడు. ఆమె ముఖంలో ఆందోళన తనతో వాగ్యుద్ధానికే అన్న విషయం రాజేశ్వరరావుకు స్పష్టంగా అర్ధమయ్యేలా వుంది...

"ఏవిటి విషయం"?

ఆమె మాట్లాడలేదు గాని... అతని వంక కొరకొరా చూచింది. "ఏమయింది? అలా ఉన్నావేం?" శాంతంగానే అడిగాడు మళ్ళీ.

"ఎలా ఉన్నాను?" కాస్త కటువుగా.

"కన్నులు ఎరుపులెక్కి ఉంటేనూ... రాత్రి నిద్రపట్టలేదా ఏం" కాస్త వెటకారం జోడించాడీ సారి.

"ఎలా పడుతుందండీ... మీకే మీరు హాయిగానే నిద్రపోయారు. మీరు నిద్రపోగలరండీ... నిద్రపోనూ గలరు, నిబ్బరంగా ఉండనూ గలరు. నేను తల్లినండి. బిడ్డల భవిష్యత్తు వారి బాగోగులు నేను పట్టించుకోకుండా ఎలా ఉండగలను... మీరు మగరాజులు. మీకెందుకుంటాయి ప్రేమలూ... పట్టింపులూనూ. తల్లడిల్లే తల్లి మనసు మీకెలా తెలుస్తుంది". అంతకంతకు పెరిగే వానలా ఆమెలో ఆగ్రహ ఛాయలకు రాజేశ్వరావు అడ్డుతగులుతూ...

"ఆగాగు... ఎందుకంత కోపం... నీవు చెప్పదలచింది శాంతంగా చెప్పు" వింటాను. "చెబితే వింటేగా... విన్నా ఆచరిస్తారన్న ఆశా లేదు. నా కంఠశోష తప్ప. ఎప్పుడు విన్నారు కనుక నా మాట" అంటూ ఆమెకూడా ఆ మంచం మీదే కూర్చొంది అతనికి కాస్త ఎడంగా.

"చెప్పు వింటాను" అన్నాడు మరింత శాంతంగా.

"చెప్పేదేముంది. అబ్బాయి పెళ్ళి విషయమే" స్వరం తగ్గించి.

"అవునూ పెళ్ళి నిశ్చయమయిందిగా... మరేమిటి"

"అదే వద్దు- ఈ పెళ్ళి నాకిష్టం లేదు. ఆ మాటకొస్తే అబ్బాయికీ ఇష్టం లేదు. ఈ సంబంధం మనకొద్దు. ఈ విషయం అమ్మాయి తరుపు వారికి తేల్చి చెప్పేయండి"

రాజేశ్వరావు విస్తుపోయాడు. మారుమాటాడక మిన్నకుండిపోయాడు. భర్తనుండి తగిన స్పందన లేకపోయేసరికి సూటిగా చూడసాగింది ఉత్కంఠతో. అతను మంచంపైనుండి లేచి గదిలోనే పచార్లుచేస్తూ క్షణకాలం ఆమెను తేరిపారచూస్తూ..

"కారణం ఏం చెప్పమంటావ్" స్వరం శాంతంగా ఉన్నా గంభీరంగా ఉంది. ఆమె అనుకున్నట్టు అతను కోప్పడలేదు.వ్యతిరేకతా చూపలేదు. ఊహించని శాంతం వహించడం ఆమెకాశ్చర్యం కలిగించింది. అదే అదనుగా తన డిమాండు సాధించబూనింది.

"ఏదో ఒకటి చెప్పండి"


"అంటే"

"ఉన్నమాటే చెప్పండి"

"అదే ఆ ఉన్నమాటే ఏమిటని?"

"కట్నం చాలదని" విసుక్కొంది.

"మరి నేనన్నమాట".



ఏమిటండీ అన్నమాట. పీటలమీద పెళ్ళిల్లే ఆగిపోతున్నాయి. మీరు గాని, మనలో మరొకరు గాని, మన బంధువులు గాని, ఇప్పటివరకూ వారి గడప తొక్కలేదు. వాళ్ళే ఒకరిద్దరు వచ్చి వెళ్ళారు. బంధుమిత్రులు లేరు. నిశ్చయ తాంబూలాలూ లేవు. అమ్మాయి మీకు తెలుసని, గుణవతి అని అబ్బాయికి ఫొటో మాత్రం చూపించారు. అన్నిటికీ తలూపాడు వెర్రి నాగన్న. అందుకని వాళ్ళిస్తానన్న కట్నానికి తలూపేయడమేనా, ఓ లాంఛనాలు లేవు, ఆడ పడచులకసలే లేవు... ఏం చూచి సరే అన్నారో గాని, పది లక్షల పైబడిన కట్నంతో కాచుకు కూర్చున్నారెందరో... మనమేదో తప్పు చేస్తున్నట్లు 'అన్నమాట?' అంటారేమండీ?...' చెప్పుకుపోతున్న ఆమె వాగ్ధాటికి ఆశ్చర్యపోయిన రాజేశ్వరావు చెంతకు చేరి అనునయిస్తూ సముదాయించే ధోరణిలో.

"లక్ష్మి కట్నం చాలదన్న కారణం తప్పు సుమా"

"ఓహో... కట్నం తీసుకోవడం నేరమయితే ఈ లోకంలో మగ బిడ్డలను కన్నవారంతా నేరస్తులే... వారందరికీ శిక్ష పడిందా? పోని కట్నం తీసుకున్న వారిలో ఏ ఒక్కరికయినా శిక్ష పడిందేమో చెప్పండి?"... జడివాన ఆగినట్లయింది. ఆమె ఆక్రోశం అంతకంతకు పెరిగి ఒక్కసారి ముగించి ఊపిరి పీల్చుకొంది.

"భయం కాదు లక్ష్మి, చట్టంపై గౌరవం. ఆడ పిల్ల తండ్రిపై సానుభూతి. అతను పడే అవస్థలపై జాలి."

"అన్ని అవస్థలు వారెందుకు పడాలి. తమకు తగిన సంబంధం వెతుక్కోవాలి"

"అదేం మాట లక్ష్మి తల్లిదండ్రులు కూతురు సుఖాన్ని ఆలోచించడం తప్పుకాదు కదా... ఆమె సుఖం పట్ల ఆశ, ఆరాటం వారికుండవా."

"చాల్లెండి... ఈ మాటలు ఎప్పుడూ వింటున్నవే. ఇవి కూడు పెట్టవు" మరింత చిరాకును ప్రదర్శించింది.

"కాదు లక్ష్మి నే చెప్పేది విను" అని చెప్పబోతున్న భర్తకు అడ్డు తగులుతూ.

"వియ్యము, నెయ్యము, కయ్యము, సమానుల మధ్యనే అన్నది మీరే చెప్పారు కదా. వారికంత స్తోమత లేదనుకుంటే వేరే సంబంధం చూసుకోమనండి"

"లక్ష్మి మన స్తోమత గురించి నీకు తెలియనిదా... నాదా చిన్న ఉద్యోగం. స్థిర చరాస్తులూ అంతంత మాత్రమే."

"ఆ మాటంటే నేనొప్పుకోను. మీది చిన్న ఉద్యోగమే కావచ్చు... కాని వారిక్కావలసింది అబ్బాయి ఉద్యోగం. వాడి ఉద్యోగం చూచే ఇస్తారు లక్షలకు లక్షలు. ముష్టి మూడు లక్షలయినా ఇవ్వలేని ఈ సంబంధం చేయాలని మీకెలా అనిపించింది" నిలదీసింది.

భర్త రాజేశ్వరరావు సహనం కోల్పోతున్నాడు. "సుగుణం చూసి తెలిసిన వారంతా అమ్మాయి మంచిదంటున్నారు. ఆ విషయంలో నిజనిర్ధారణ చేసుకున్న పిదపే నేమాటిచ్చాను" అసహనంగా అన్నాడు.

"పెళ్ళికి ముందు అందరూ అలాగే చెబుతారు. అత్తింటికి వచ్చిన ఆర్నెల్లు దాటాకనే తెలుస్తుందా సంబరం" లేచి వెళ్ళబోయిన రాజ్యలక్ష్మి ఆగి చటుక్కున వెనుకకు తిరిగి "కట్నం తీసుకోవడం నేరం అంటున్నారు కదా... నాకు తెలీకడుగుతాను ఈమాత్రపు కట్నం మాత్రం మీరెందుకు తీసుకొంటున్నట్టో" సూటి ప్రశ్ననే సంధించిందీసారి.

"నేను అవునన్నది కట్నం కాదు. చట్టరీత్యా ఆ అమ్మాయికి రావల్సిన వాటా... అది ఆమెకు సంక్రమించిన హక్కు. అందుకే సమ్మతించాను. అదీగాక ఆ సొమ్ము అమ్మాయికే గాని మనకోసం కాదు గదా" అనగానే ఆమె బుగ్గలు నొక్కుకుంటూ చారడేసి కళ్ళు చక్రాల్లా తిప్పుకొంటూ...

"ఏవిటీ... ఆ సొమ్మయినా ఆ అమ్మాయికేనా. మరి పెళ్ళి ఖర్చుల మాటేమిటి? ఆడపడచు మాటేమిటి...? అక్కసుతో ఆశ్చర్యాన్ని జోడించింది.

"ఛ ఛ... స్త్రీ విత్తమా... తప్పు తప్పు. అది ఆమె భవిష్యత్తుకై తల్లిదండ్రులిచ్చే సొత్తు. దీనిని ఉత్తరోత్రా

